సాక్షి
శ్రీకాకుళం

మంగళవారం, 6, మే, 2025



కబ్జాకు యత్నం

పలాసలో ప్రభుత్వ ఐటీఐ స్థలం కబ్జాకు యత్నిస్తున్నారు. అడ్డుకున్నా ఫలితం లేకపోతోంది.

- 8లో



టీచర్లకు 'ప్రత్యేక పరీక్ష'

వేసవిలో బోధనపై టీచర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

- 8లో

వాట్సాప్ గవర్నెన్స్ సేవలపై వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: వాట్సాప్ గవర్నెన్స్ సేవలను విస్తరించేందుకు అవగాహన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ప్రజలు 95523 00009 నంబర్‌కు వాట్సాప్‌లో 'హాయ్' అని పంపి, లైసెన్సులు, పన్నులు, రశీదులు, పరీక్ష ఫలితాలు, టికెట్ బుకింగ్ వంటి సేవలు పొందవచ్చు.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఏయూఈఈటీ పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కాలేజ్‌లో ఏయూఈఈటీ - 2025 (ఆంధ్రా యూనివర్సిటీ ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ టెస్ట్) సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఐదేళ్ల సమీకృత బీటెక్ కోర్సు కోసం ఏయూ ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తుంది. జిల్లాలో ఈ పరీక్ష కేంద్రానికి 433 మందిని కేటాయించగా, 391 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటలు వరకు పరీక్ష నిర్వహించారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతాడ రాజశేఖర్ రావు, జాయింట్ చీఫ్ సూపరింటెండెంట్‌గా పొన్నాడ రామకృష్ణారావు వ్యవహరించారు.

ఉద్దానంలో కార్గో ఎయిర్‌పోర్టు వద్దు



భేతాళపురం వద్ద ప్రజల ఆందోళన

మందస: దశాబ్దాలుగా ఉద్దానంలో కొబ్బరి, జీడి, పనస, మామిడిపై ఆధారపడి ప్రజలు జీవిస్తున్నారని, కార్గో ఎయిర్‌పోర్టు రాకతో వీరంతా ఉపాధి కోల్పోతారని భేతాళపురం, గంగువాడ, రాంపురం ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. పచ్చటి ఉద్దానంలో కార్గో ఎయిర్‌పోర్టు వద్దని చెబుతున్నా ప్రభుత్వం వినకపోవడం బాధాకరమన్నారు. ఎయిర్‌పోర్టును వ్యతిరేకిస్తూ వారంతా భేతాళపురంలో సోమవారం ఆందోళన నిర్వహించారు. గత 180 రోజుల నుంచి నిరంతరం నిరసనలు చేస్తున్నామని, అయినా ప్రభుత్వం స్పందించడం లేదని తెలిపారు. ఎయిర్‌పోర్టు పేరుతో 1394 ఎకరాల భూమితో పాటు మూలపేట పోర్టు నుంచి కార్గో ఎయిర్‌పోర్టు వరకు 55 కిలోమీటర్ల రోడ్డు వెడల్పు కోసం కూడా రైతులు భూములు కోల్పోవాల్సి వస్తుందన్నారు. రానున్న రోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామన్నారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

మెళియాపుట్టి: ప్రేమ పేరుతో మభ్యపెట్టి బాలికను హైదరాబాద్ తీసుకుపోయిన యువకుడిపై టెక్కలి అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. టెక్కలి ఎస్‌డీపీఓ, అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద వివరాలు వెల్లడించారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక కనబడటం లేదని 22 ఏప్రిల్ 2025న ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశారు. గంగరాజపురం గ్రామానికి చెందిన ప్రఫుల్లో ప్రధాన్ అనే 21 ఏళ్ల యువకుడు బాలికను తీసుకెళ్లినట్లు సమాచారం అందడంతో ఈనెల 3వ తేదీన గంగరాజపురం గ్రామంలో యువకుడిని అరెస్ట్ చేశారు. దీనిపై దర్యాప్తు కొనసాగుతోందని తెలిపారు. ఎస్‌ఐ రమేష్ బాబు ఉన్నారు.

ఈ ఫొటోలో కనిపిస్తున్న కొండ పేరు సూదికొండ. పలాస-కాశీబుగ్గలో ఉంది. కూటమి ప్రభుత్వంలో కొండల్ని ఎలా కొల్లగొడుతున్నారో చెప్పడానికి ఇదే ప్రత్యక్ష నిదర్శనం. గ్రావెల్ కోసం మట్టి మాఫియా దాష్టీకానికి ఒడిగట్టింది. అక్రమార్కులకు సూదికొండ ఆదాయ వనరుగా మారింది. అనుమతుల పేరుతో ఇప్పటికే సగానికి పైగా కొండను తవ్వేశారు. మిగతాది తవ్వేసే ప్రయత్నంలో ఉన్నారు. ఇలాగే వదిలేస్తే సూదికొండ మిగలకుండా పోతుంది.

సూదికొండ మిగలకుండా..





పొక్లెయినర్లతో తవ్వకాలు జరుపుతున్న దృశ్యం

- కొండను కొల్లగొట్టేస్తున్న కూటమి పెద్దలు
- ఇప్పటికే సగానికిపైగా గుండు కొట్టేసిన వైనం
- పతాక స్థాయికి చేరిన విధ్వంసం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

కూటమి ప్రభుత్వంలో విధ్వంసం పతాకస్థాయికి చేరుతోంది. ముఖ్యంగా పలాస నియోజకవర్గంలో సహజ వనరులు దోపిడీకి గురవుతున్నాయి. పచ్చని కొండలు ఛిద్రమైపోతున్నాయి. కొండలు వన్యప్రాణులకు నెలవుగా ఉంటాయి. పర్యావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. తుఫాన్‌లు ఇతరత్రా ప్రకృతి వైపరీత్యాల సమయంలో రక్షణగా నిలుస్తాయి. కానీ, ఇప్పుడా కొండలపైనే కూటమి నేతల కన్ను పడింది. అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టి దర్జాగా సొమ్ము చేసుకుంటున్నారు. పలాస నియోజకవర్గంలో సూదికొండపై గ్రావెల్ మాఫియా బరితెగించింది. రేయింబవళ్లు దర్జాగా తవ్వి తరలించేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇప్పటికే సూదికొండ సగానికి పైగా తరిగిపోయింది. స్థానికులు ఫిర్యాదులు చేస్తున్నా రెవెన్యూ, గనుల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.



సూదికొండలో తవ్వకాలు జరిపి, టిప్పర్లలో తరలిస్తున్న దృశ్యం

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పురుషోత్తపురం రెవెన్యూ పరిధిలో గల సర్వే నంబర్ 51లో 60 ఎకరాల విస్తీర్ణంలో సూదికొండ ఉంది. 2014-19లోనే పట్టణంలోని సూదికొండపై తమ్ముళ్ల కన్ను పడింది. ఇష్టారీతిన తవ్వకాలు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక చాలావరకు నిలువరించారు. మళ్లీ కూటమి ప్రభుత్వం వచ్చాక బరితెగించారు. ఎవరి హయాంలో విధ్వంసం ప్రారంభమైందో వారి హయాంలోనే మళ్లీ జడలు విప్పింది. విచిత్రమేమిటంటే అక్కడ క్వారీకి అధికారులు అనుమతులు ఇచ్చారని చెప్పి చెలరేగిపోతున్నారు. ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన నాయకుడు ఇదే మంచి అవకాశంగా తీసుకున్నారు. ఇష్టారీతిన తవ్వి తరలించేస్తున్నారు. మరోవైపు ఎంఐజీ లే అవుట్‌కు తరలిస్తున్నామంటూనే ఎక్కడెక్కడికో రవాణా చేసేస్తున్నారు. కేంద్రీయ విద్యాలయం కోసమని కూడా తవ్వకాలు జరుపుతున్నారు. చదును పేరుతో గ్రావెల్ బిజినెస్ చేస్తున్నారు. రూ.కోట్లలో అక్రమార్కులు ఆర్జిస్తున్నారు. ఇదంతా చూస్తుంటే కొన్నాళ్లకు ఇక్కడొక సూదికొండ ఉండేది అని చెప్పుకునే పరిస్థితి వచ్చేసినా ఆశ్చర్యపడనక్కర్లేదు.

ఎస్‌బీఐ మరో బ్రాంచిలో అవకతవకలు

- వార్తల్లోకి ఎక్కిన సిలగాం బ్రాంచ్
- డ్వాక్రా సంఘాల పేరుతో రుణాల కాజేసిన వైనం
- ఇప్పటికే బాధ్యుడిగా ఒకరిపై సస్పెన్షన్, డిస్మిస్
- వరుస ఘటనలతో ఎస్‌బీఐకు అప్రతిష్ట



కవిటి మండలం సిలగాం ఎస్‌బీఐ బ్రాంచి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచుల్లో వరుస పెట్టి అక్రమాలు బయటపడుతున్నాయి. గతంలో గార ఎస్‌బీఐలో తాకట్టు బంగారం బ్రాంచి నుంచి మాయమై, వేరే ఫైనాన్స్ సంస్థల్లో తాకట్టు పెట్టిన ఘటన వెలుగు చూడగా, ఆ మధ్య నరసన్నపేట బజారు బ్రాంచిలో ఉద్యోగుల పేరుతో రుణాలను నొక్కేసిన బాగోతం బయటపడింది. తాజాగా కవిటి మండలం సిలగాం ఎస్‌బీఐ బ్రాంచిలో డ్వాక్రా సంఘాల పేరుతో రుణాలను కాజేసిన వ్యవహారం వెలుగు చూసింది. ఇవన్నీ గతంలో జరిగినప్పటికీ కాలక్రమేణా బయటకు వస్తున్నాయి.

కవిటి మండలం సిలగాం బ్రాంచిలో డ్వాక్రా సంఘాల పేరుతో రుణాలను కాజేసిన తాజాగా వ్యవహారం వెలుగు చూసింది. శాఖా పరమైన విచారణలో అవినీతి బయటపడింది. దాంట్లో బాధ్యుడైన ఉద్యోగిని సస్పెండ్, డిస్మిస్ కూడా చేయడం జరిగింది. కాకపోతే ఆడిట్‌లో అభ్యంతరం వస్తూ ఉండటంతో తాజాగా క్రిమినల్ చర్యల కోసం ఎస్‌బీఐ అధికారులు పోలీసులను ఆశ్రయించారు. బ్యాంకు అధికారుల అంతర్గత పూర్తి విచారణ నివేదిక తీసుకొస్తే తప్ప ముందుకు వెళ్లలేమని పోలీసులు చెప్పడంతో ఇప్పుడా విచారణ నివేదికను, చర్యల ఫైల్‌ను పట్టుకుని వెళ్లే పనిలో బ్యాంకు ఉన్నతాధికారులు ఉన్నారు.

డ్వాక్రా సంఘాలకు బురిడీ..

కవిటి మండలం సిలగాం బ్రాంచి పరిధిలోని డ్వాక్రా సంఘాలను బురిడీ కొట్టించారు. సంఘాలకు ఇచ్చింది కొంతైతే... వాటి పేరున నొక్కేసింది మరికొంత. డ్వాక్రా సంఘాలకు అధికారికంగా ఉన్న ఖాతాలకు కొంతమేర రుణాలిచ్చినట్లు చూపించగా, ఆ సంఘాల పేరుతో నకిలీ ఖాతాలను సృష్టించి, మరికొంత రుణాలు తీసుకున్నారు. దీంతో బ్యాంకు లెడ్జర్లలోనూ, డీఆర్‌డీఏ రికార్డుల్లోనూ రుణాల లెక్కల్లో తేడా వచ్చింది. దీనిపై శాఖా పరమైన విచారణ చేపట్టడంతో గతంలోనే అవినీతి బట్టబయలైంది. కాకపోతే, వ్యవహారాన్ని గుట్టు చప్పుడు కాకుండా ఉంచారు. అంతర్గతంగానే సెటిల్ చేసేశారు. కాకపోతే, బ్యాంకు ఆడిట్‌లో ఆ అక్రమంపై అభ్యంతరం వ్యక్తం కావడంతో న్యాయపరమైన చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి సదరు బ్యాంకు అధికారులకు ఎదురైంది. దానిలో భాగంగా ఆలస్యంగా పోలీసులను ఆశ్రయించారు.



అవినీతి మాఫీ..

సిలగాం బ్రాంచిలో నాలుగేళ్ల క్రితం అవినీతి జరిగింది. ఆ అవినీతి కూడా మాఫీ అయిపోయింది. డ్వాక్రా సంఘాలకు పావలా వడ్డీకే రుణాలు ప్రభుత్వం ఇస్తున్నందున ఈ సంఘాల పేరుతో రుణాలు నొక్కేసి, ఆ సొమ్మును బయట వడ్డీలకు తిప్పి మొత్తంలో సంపాదించుకున్నారు. అదేవిధంగా వైఎస్ జగన్ ప్రభుత్వం డ్వాక్రా రుణాలు మాఫీ చేయడంతో బ్యాంకు అధికారులు సొంతానికి వాడుకున్న రుణాలు కూడా మాఫీ అయిపోయాయి. ఈ విధంగా మాఫీలో ఎంత లబ్ధి పొందారు, నకిలీ ఖాతాల పేరుతో ఎంత మేర రుణాలను కొట్టేశారో అన్నది ఇంతవరకు బయటికి వెల్లడి కాలేదు. బ్యాంకు అధికారులు గుట్టుగానే ఉంచారు. మౌఖికంగా ఫిర్యాదు చేయడానికి పోలీసుల వద్దకొస్తే ఆ మొత్తం అవినీతి నివేదిక తీసుకురావాలని చెప్పడంతో వెనక్కి వచ్చేశారు. నాటి బాగోతంలో క్యాష్ ఇన్‌చార్జి సరోజ్‌కుమార్ కీలక పాత్ర పోషించారని, ఆ కేసులో సస్పెండ్‌తో పాటు డిస్మిస్ అయినట్లు కూడా తెలిసింది. ఇప్పటికే నరసన్నపేట బజారు బ్రాంచిలో ఉద్యోగుల పేరు చెప్పి రుణాలు తీసుకుని, ఆ సొమ్ము దిగమింగేసిన ఘటనలో ఒకరు సస్పెండ్ అవ్వగా, గారలో తాకట్టు బంగారం మాయం చేసిన ఘటన అరెస్టులు, సస్పెన్షన్‌లు జరిగాయి. తాజాగా సిలగాం సరోజ్ కుమార్ ఒక్కరేనా? మిగతా వారి పాత్ర ఎంత? అనేది పూర్తి స్థాయిలో విచారణ జరిగితే తేలే అవకాశం ఉంది.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



స్కీమ్ కాదు.. అదో పెద్ద స్కామ్

- బీసీ రుణాల పేరుతో కూటమి నేతలు జేబులు నింపుకుంటున్నారు
- బీసీలను ఆదుకున్నది వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమే
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్

హామీలు నెరవేర్చకుండా అవినీతి




మహిళలకు కుట్టుమిషన్ల పేరుతో చంద్రబాబు ప్రభుత్వం కోట్ల రూపాయల అవినీతికి ప్లాన్ వేసింది. తల్లికి వందనం, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం ఇస్తానని హామీ ఇచ్చి చివరకు ఇలాంటి పనులు చేస్తున్నారు. హామీలు నెరవేర్చకుండా ఒకసారి మోసం చేశారు. అవినీతితో రెండోసారి మోసం చేస్తున్నారు. అన్ని వ్యవస్థల్లో అవినీతికి పాల్పడుతూ గుట్టు చప్పుడు కాకుండా కోట్లాది రూపాయలు కాజేయడం చంద్రబాబు నైజం.

– పేరాడ తిలక్, వైఎస్సార్ సీపీ టెక్కలి సమన్వయకర్త

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ)/ టెక్కలి: బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదు, బ్యాక్‌బోన్ అని నమ్మిన వ్యక్తి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎక్కడా ఎలాంటి అవినీతికి ఆస్కారం లేకుండా అర్హతే ప్రామాణికంగా నేరుగా లబ్ధిదారుని ఖాతాల్లోకే డబ్బులు జమ చేశారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ అన్నారు. చంద్రబాబునాయుడికి మాత్రం స్కీమ్‌లు స్కామ్‌లతో సమానమని మండిపడ్డారు. శ్రీకాకుళం నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడారు. మహిళా దినోత్సవం నాడు ప్రారంభించిన కుట్టుమిషన్ల శిక్షణ స్కీమ్‌లో రూ.150కోట్లు స్కామ్ చేయడం అన్యాయమన్నారు. వాస్తవానికి ఒక్కో మహిళకు కుట్టుమిషన్ ఇచ్చేందుకు రూ.4300, శిక్షణకు రూ.3 వేలు మొత్తం రూ.7300 అవ్వగా టెండర్‌లో మాత్రం ఏకంగా రూ.21500 చూపించడం దారుణమన్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా లక్ష మందికి పైగా ఈ పథకానికి యూనిట్, శిక్షణ ఇవ్వడానికి అయిన ఖర్చు కేవలం రూ.75.06 కోట్లు పోగా మిగిలిన రూ.146.02కోట్లు స్వాహా చేసేశారన్నారు. ఈ శిక్షణ కేవలం 50రోజుల్లో పూర్తిచేసి మిగతా మొత్తాన్ని చంద్రబాబునాయుడు కోట రీ బొక్కేయడం సరికాదన్నారు. కమ్మ, క్షత్రియ, కాపు, ఆర్యవైశ్య కులాలకు కుట్టు మిషన్ల పంపిణీ అంటూ రూ.115 కోట్లకు టెండర్లు పిలిచి అందులో మరో రూ.81.05 కోట్లు స్కామ్ చేశారని ఆరోపించారు. బీసీ కార్పొరేషన్ లోన్ల కోసం టీడీపీ నేతల వెనక తిరగాల్సి వస్తోందని, వైఎస్సార్ సీపీ హయాంలో ఈ దుస్థితి ఉండేది కాదని అన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి, కూటమి ప్రభుత్వానికి మధ్య తేడాను గమనించాలన్నారు.

కళింగవైశ్య కుల, తూర్పుకాపు, కాళింగ కుల రాష్ట్ర అధ్యక్షులు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, దుంపల లక్ష్మణరావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం మాట్లాడుతూ 56 కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి చైర్మన్లు, డైరెక్టర్లను నియమించి బీసీ సంక్షేమాన్ని వైఎస్ జగన్ గొప్పగా నిర్వర్తించారని గుర్తు చేశారు. అర్హతే ప్రామాణికంగా తీసుకుని అందరికీ సంక్షేమ పథకాలు అందించామన్నారు. బీసీలకు లోన్లు, కుట్టుమిషన్ల పేరుతో ఈ ప్రభుత్వం స్కామ్ చేస్తోందని దుయ్యబట్టారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి వెంకట సత్యనారాయణ, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు రౌతు శంకరరావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణ, సాధు వైకుంఠరావు, గొండు రఘురాం, రాజాపు అప్పన్న, గుప్తా, బొబ్బాది ఈశ్వరరావు, భార్గరావు, తంగి అప్పన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

కూటమి స్కామ్‌లతో ఖజానా ఖాళీ



కూటమి స్కామ్‌లతో ఖజానా ఖాళీ అవుతోంది. దాదాపు రూ.150 కోట్ల నిధులను దోపిడీ చేశారు. టెండర్ల దశ నుంచే అక్రమాలు జరిగాయి. రాష్ట్రంలోని బీసీ కార్యకర్తలు, బీసీ మహిళా సంఘాలు దీనిపై దృష్టి సారించాలి.

–దుంపల లక్ష్మణరావు, వైఎస్సార్‌సీపీ కాళింగ కుల రాష్ట్ర అధ్యక్షుడు

వేసవిలో స్విమ్‌పుల్ థెరపీ



జిల్లా కేంద్రంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న స్విమ్మింగ్ పూల్ కిటకిటలాడుతోంది. వేసవి సెలవులు కావడంతో చిన్నారులు ఇక్కడ ఈత నేర్చుకునేందుకు ఎగబడుతున్నారు. చిన్నారులతో పాటు పెద్దలు కూడా స్విమ్మింగ్ చేస్తూ సేద తీరుతున్నారు. నిపుణుల సమక్షంలోనే స్విమ్మింగ్ నేర్పిస్తుండడంతో చిన్నారులు ఈత నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

ఉద్దానం ప్రాజెక్టు ద్వారా ఇచ్ఛాపురానికి తాగునీరు



నీటి సరఫరా ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్, చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: వైఎస్ జగన్ సర్కారు నిర్మించిన వైఎస్సార్ సుజలధార ఉద్దానం ప్రాజెక్టు ఇప్పుడు ఇచ్ఛాపురం మున్సిపాలిటీ దాహం తీర్చనుంది. మున్సిపాలిటీలో తాగునీటి కొరత ఏర్పడడంతో ఉద్దానం ప్రాజెక్టే పెద్దదిక్కుగా మారింది. మున్సిపాలిటీ ప్రజల దాహార్తిని తీర్చడానికి సంతపేట వద్ద ఉద్దానం వాటర్ ప్రాజెక్టుని మున్సిపల్ నీటి సరఫరా పంప్‌హౌస్‌కి అనుసంధానం చేశారు. ఈ నీటి సరఫరాను సోమవారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ప్రారంభించారు. నదిలో ఇసుక తవ్వకాల వల్లనే మున్సిపాలిటీకి తాగునీటి కొరత ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన వైఎస్సార్ సుజలధార ఉద్దానం వాటర్ ప్రాజెక్టు ద్వారా కవిటి, కంచిలి, సోంపేట, మందస, వజ్రపుకొత్తూరు, పలాస, ఇచ్ఛాపురం మండలాలకు నీటి సరఫరా చేస్తున్నారు. దీనిపై అధికార పక్ష నాయకులు ఎన్ని విమర్శలు చేసినా ఆఖరకు అదే ప్రాజెక్టు ఇప్పుడు దాహం తీరుస్తోంది. అయితే మున్సిపాలిటీ పంప్ హౌస్‌కు అనుసంధానం చేసిన ఘనత తమదే అని ఎమ్మెల్యే గొప్పలు చెప్పుకోవడం కనిపించింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, ఈఈ సుగుణాకర్‌రావు, మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భారీగా మద్యం బాటిళ్లు పట్టివేత



పట్టుబడిన మద్యం బాటిళ్లు, నిందితులను చూపిస్తున్న పోలీసులు

రణస్థలం: మండలంలోని సంచాం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు అక్రమంగా మద్యం తరలిస్తుండగా జేఆర్‌పురం పోలీసులు ఆదివారం రాత్రి పట్టుకున్నారు. జేఆర్‌పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి తెలిపిన వివరాల మేరకు అక్రమంగా మద్యం తరలిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు పోలీసులు సంచాం జంక్షన్ వద్ద పెట్రోలింగ్ నిర్వహించారు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు ఒక పల్సర్ బైక్ మధ్య మూడు అట్టపెట్టెలు పెట్టుకుని వస్తూ పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో నలువైపుల నుంచి పోలీసులు వాళ్లను వెంబడించి పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో మీసాల రాము(పండు), గంట్యాడ సాయికుమార్‌లు ఉన్నారు. వివిధ మద్యం షాపుల నుంచి మద్యం కొనుగోలు చేసి సంచాం గ్రామానికి చెందిన బొంతు గణేష్ ద్వారా అధిక ఆదాయం కోసం అమ్ముతున్నట్లు గుర్తించారు. దీంతో ముగ్గురుని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 193 మద్యం బాటిళ్లు, ఒక పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైనవారిని రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు



ప్రమాద స్థలంలో ఆటో, ద్విచక్ర వాహనం

రణస్థలం: మండలంలోని కొండములగాం గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. జేఆర్‌పురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మన్నెల మహాలక్ష్మి, వడ్డి మణికంఠ, మన్నెల వెంకటేష్‌లు కొండములగాం గ్రామంలో సోమవారం ఉదయం ఉపాధి హామీ పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి బయల్దేరారు. శ్మశానాల చెరువు దగ్గర నుంచి ఇటుకబట్టీ పక్కనున్న మట్టి రోడ్డు మీదుగా రామతీర్థాలు తారురోడ్డుపైకి వేగంగా వచ్చారు. అదే సమయంలో కమ్మసిగడాం వైపు నుంచి రణస్థలం వస్తున్న కూల్ డ్రింకుల లగేజీ ఆటో ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఇద్దరు, బైక్‌పై ఉన్న ముగ్గురు గాయపడ్డారు. ముగ్గురు వేతనదారులకు, ఆటో డ్రైవర్ మహంతి రమణకు తొలుత రణస్థలం సామాజిక ఆస్పత్రిలో చికిత్స అందించారు. తదుపరి ఇద్దరు వేతనదారులు మన్నెల మహాలక్ష్మి, వడ్డి మణికంఠలను శ్రీకాకుళంలో రిమ్స్, మరొక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఆటోలో ఉన్న మరో వ్యక్తి గొర్లె రమణకు కాలర్ బోను విరగడంతో శ్రీకాకుళంలో ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మన్నెల మహాలక్ష్మి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. ఈ ప్రమాదంపై జేఆర్‌పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

వీఎంఆర్‌డీఏ మాజీ అధికారులపై విచారణ

శ్రీకాకుళం(పీఎన్ కాలనీ): శ్రీకాకుళంలో తుపాను నీటి కాలువ నిర్మాణంలో అవకతవకలపై వీఎంఆర్‌డీఏ మాజీ అధికారులపై విచారణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో చిన్న బజార్ నుంచి ఇల్లిసిపురం రోడ్డు మధ్య తుఫాను నీటి కాలువ నిర్మాణం చేపట్టారు. ఈ పనుల నిర్వహణ విషయంలో పలు ఆరోపణలు వచ్చాయి. దీంతో అప్పటి వీఎంఆర్‌డీఏ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ డి.విజయభారతి, క్వాలిటీ సెల్ ఏఈ ఎ.వి.రమణారావు, డీఈఈ జి.శ్యాంసుందర్‌లపై విచారణ చేయాలని నిర్ణయించింది. వీరు 15 రోజుల్లోగా ఈ ఆరోపణలపై రాత పూర్వకంగా వివరణ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

ప్రభుత్వ ఐటీఐ స్థలం
కబ్జాకు యత్నం



ప్రభుత్వ ఐటీఐ స్థలంలో పునాదులు తవ్వుతున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాసలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల స్థలాన్ని కబ్జా చేసి పునాదులు వేసేందుకు పలాసకు చెందిన ఇద్దరు వ్యక్తులు సోమవారం ప్రయత్నించారు. స్థలాన్ని జేసీబీ ట్రాక్టర్ పెట్టి చదును చేయగా సమాచారం తెలుసుకున్న ప్రిన్సిపాల్ పైల జవహర్ సంఘటన స్థలానికి చేరుకొని అడ్డుకున్నారు. ఆ ఇద్దరు వ్యక్తులు ప్రిన్సిపల్ పై తిరగబడగా.. వారు ప్రిన్సిపాల్ జవహర్‌తో అసభ్యకరంగా మాట్లాడటంతో కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సూదికొండకు వెళ్లే రహదారిలో ప్రైవేటు ఐటీఐ కళాశాలను మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథం 25 సెప్టెంబరు 2010లో ప్రభుత్వానికి ధారాదత్తం చేశారు. దానికి ముందు అప్పటి తహసీల్దార్ సహకారంతో సర్వే చేయించి నాటి నివేదికలు ఆధారంగా సర్వే నంబర్ 232 /2ఎ3లో మూడు ఎకరాల 27 సెంట్లు భూమి, కోట్లాది రూపాయలు విలువ చేసే భవనాలను ఉచితంగా ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఏర్పాటుకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డికి అప్పగించారు. అయితే ఐటీఐకి సెలవు దినాలలో, సిబ్బంది లేని సమయం చూసుకుని భూబకాసురులు స్థలాలను ఆక్రమించుకునేందుకు పునాదులు తవ్విస్తున్నారు. గతంలోనూ దీనిపై కలెక్టర్ గ్రీవెన్స్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. సర్వే చేయించినా ఆ తర్వాతి కార్యకలాపాలు జరగలేదు. సెలవు దినాల్లో కూడా రోజుకొకరు చొప్పున కాపలా కాయాల్సిన వస్తోందని, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఐటిఐ ప్రిన్సిపాల్ పైల జవహర్ కోరారు.



ద్విచక్రవాహనంపై ఉన్న ప్రిన్సిపాల్ జవహర్‌ను హెచ్చరిస్తున్న ఆక్రమణదారులు

ఉపాధ్యాయులకు 'ప్రత్యేక పరీక్ష'

- పదో తరగతి ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులపై ఆదేశాలు
- ఆలస్యంగా ఉత్తర్వులు వెలువరించడంపై ఆవేదన

శ్రీకాకుళం: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు మూడు రోజుల కిందట విడుదల చేసిన ఉత్తర్వులు ఉపాధ్యాయుల ఆవేదనకు దారి తీస్తున్నాయి. పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించేవరకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించడంపై ఉపాధ్యాయ వర్గం ఆవేదన వ్యక్తం చేస్తోంది. వేసవి సెలవుల్లో విహారయాత్ర, తీర్థయాత్రలకు వెళ్లేందుకు పలువురు ఉపాధ్యాయులు కొన్ని నెలల కిందటి నుంచే ఏర్పాట్లు చేసుకున్నారు. ప్రభుత్వం గతంలోని లేని విధంగా ఈ ఏడాది ప్రత్యేక తరగతులపై ఆదేశాలు జారీ చేయడం, అదికూడా ముందస్తుగా కాకుండా వేసవి సెలవుల అయిన ఏప్రిల్ 23 తర్వాత ఉత్తర్వులు విడుదల చేయడంపై ఉపాధ్యాయ వర్గాలు తప్పుపడుతున్నాయి. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల సెలవులు వినియోగించుకుంటే ఈఎల్‌సి మంజూరు చేయడం పరిపాటి. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో ఈఎల్‌సీ ప్రస్తావన లేదు. దీనిపైన కూడా ఉపాధ్యాయులు పెదవి విరుస్తున్నారు. అందుబాటులో ఉన్న పలువురు ఉపాధ్యాయులు బోధన కోసం పాఠశాలలకు వెళ్లినా కొన్ని పాఠశాలల్లో ఒకరిద్దరు హాజరువుతుండటం, మరికొన్ని పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా హాజరు కాకపోవడం తలనొప్పిగా మారింది. విద్యార్థులకు ఫోన్‌లు చేసినా వారు తరగతులుకు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదని ఉపాధ్యాయులు చెబుతున్నారు. తరగతులు బోధించినపుడు ఫోటోలు తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉండగా, విద్యార్థులు హాజరుకాని సందర్భంలో ఏం చేయాలో పాలుపోక ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు.

గతంలో ఎన్నడూ లేదు



ఈఎల్‌సీలు ఇవ్వకుండా ఉపాధ్యాయుల సేవలు వినియోగించుకున్న సందర్భాలు గతంలో లేవు. సప్లిమెంటరీ పరీక్ష మరో పది రోజులుండగా, ఇప్పుడు ప్రత్యేక తరగతులపై ఉత్తర్వులు జారీ చేయడం విడ్డూరం. ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయం వివాదాస్పదంగానే ఉంటుంది. – పేడాద కృష్ణారావు, డీటీఎఫ్ నాయకుడు

పాత పింఛన్ విధానం అమలు చేయాలి



పోస్టు కార్డులను పంపిస్తున్న ఉద్యోగులు

శ్రీకాకుళం అర్బన్: కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పాత పింఛన్ విధానం అమలు చేయాలని 2003 డీఎస్సీ జిల్లా ఫోరం కన్వీనర్ కొత్తకోట శ్రీహరి డిమాండ్ చేశారు. పాత పింఛన్ విధానం అమలు కోరుతూ శ్రీకాకుళంలోని జిల్లా ప్రధాన తపాలా కార్యాలయం వద్ద పోస్టుకార్డులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిలకు సోమవారం పంపించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ బలగ శ్రీను మాట్లాడుతూ రాష్ట్రంలో సీపీఎస్ విధానం అమలైన తేదీ 2004 సెప్టెంబర్ ఒకటి కంటే ముందు విడుదలైన నోటిఫికేషన్ ద్వారా తాము నియమితులయ్యామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 11 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు కేంద్ర మెమో 57 ప్రకారం పాత పింఛన్‌కు అర్హులని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ మెమో ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పింఛన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే విడతలు వారీగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎస్సీ 2003 ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నాయకులు గురుగుబెల్లి భాస్కరరావు, బుచ్చిబాబు, అనిల్ కుమార్, మాధవి, శ్రీదేవి, లోకనాథం, రామకృష్ణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ట్రాక్టర్

నరసన్నపేట: జాతీయ రహదారి సర్వీసు రోడ్డుపై సత్యవరం కూడలి వద్ద సోమవారం సాయంత్రం ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో ద్విచక్ర వాహనం నడుపుతున్న శ్రీకాకుళం బలగకు చెందిన జయబాబుకు తీవ్రగాయాలయ్యాయి. మాకివలస పండగలకు వచ్చిన ఆయన నరసన్నపేట వెళ్తున్నప్పుడు సర్వీసు రోడ్డుపై ప్రమాదం జరిగింది. గాయపడ్డ జయబాబును ఎన్‌హెచ్ అంబులెన్స్ సిబ్బంది ప్రాథమిక వైద్యం చేసి, అనంతరం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన అక్కడ చికిత్స పొందుతున్నాడు.

'విద్యార్థులపై సర్కారు నిర్లక్ష్యం'



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న దళిత సంఘాల జేఏసీ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకులాల్లో దళిత విద్యార్థులను కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని దళిత సంఘాల జేఏసీ నాయకులు మండిపడ్డారు. శ్రీకాకుళంలోని అంబేడ్కర్ విజ్ఞానమందిర్‌లో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ విద్యార్థులకు ఇస్తున్న కాస్మొటిక్స్ చార్జీలు ఇవ్వకుండా రద్దు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాకుళం జిల్లాలో ఎచ్చెర్ల, విశాఖ జిల్లా గొలుగొండ, విజయనగరం జిల్లా కొప్పెర్ల మొదలుకొని చిత్తూరు జిల్లా వరకు దళిత విద్యార్థులు గురుకులాల్లో దయనీయమైన పరిస్థితులు ఎదుర్కొంటున్నారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో బాలికల/బాలుర గురుకుల పాఠశాల 1983 స్థాపించారని సుమారుగా 30 సంవత్సరాల నుంచి అవే భవనాలు ఉండడం దారుణమన్నారు. ప్రజాప్రతినిధులు పూర్తిగా పట్టించుకోకపోవడం వల్లనే దళిత విద్యార్థులు విద్యా అవకాశాలకు దూరమైపోతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో ఉన్న సమస్యలపై ప్రత్యేకమైన కమిటీతో అధ్యయనం చేయించాలని సూచించారు. కార్యక్రమంలో సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్, కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మిస్క కృష్ణయ్య, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి తదితరులు పాల్గొన్నారు.

ఇదేం తీరు..!

- ఉపాధి వేతనదారులపై ఫీల్డ్ అసిస్టెంట్ ఆగ్రహం



ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వేతనదారులు

సంతబొమ్మాళి: నాకు నచ్చిన చోట ఉపాధి పని ఇస్తాను.. నచ్చిన వారికి మస్టర్లు వేస్తాను.. ఎవరైనా ప్రశ్నిస్తే పని చేసినా మస్టర్ వేయనని వేతనదారులను నౌపడ ఫీల్డ్ అసిస్టెంట్ ఉలాస దేవానం దొడ్డి బెదిరించాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని నౌపడలో రెల్లిబంద చెరువు వద్ద వేతనదారులందరికీ ఒకేచోట పని కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను సోమవారం సాయంత్రం ఉపాధి వేతనదారులు కోరారు. దీంతో ఆగ్రహించిన ఆయన తాను ఎక్కడ పని చేయమంటే అక్కడ చేయాలని, ప్రశ్నిస్తే వేతనాలు రాకుండా చేస్తానంటూ రెచ్చిపోయాడు. దీంతో సమస్య గురించి అడిగిన ప్రతీసారి బెదిరిస్తూ మాట్లాడడం తగదని వేతనదారులు అన్నారు. తమను గౌరవించడం నేర్చుకోవాలని హితవు పలికారు. అయితే ఉపాధి పనుల వద్ద గొడవ జరుగుతుందనే విషయం విలేకరులకు తెలియడంతో అక్కడికి వెళ్లగా విలేకరులను చూసి నెమ్మదిగా ఫీల్డ్ అసిస్టెంట్ జారుకున్నాడు. గతంలో కూడా ఆయన పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, హీనంగా మాట్లాడాడని వేతనదారులు చెబుతున్నారు. ఈ విషయాన్ని ఉపాధి అధికారులకు తెలిపినా మార్పు రాలేదన్నారు.

విద్యుత్ షాక్‌తో బాలికకు తీవ్రగాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక

కవిటి: మండలంలోని సీహెచ్ కపాసుకుద్ది గ్రామంలో విద్యుత్ షాక్‌తో మైలపల్లి తులసీ(13) అనే బాలిక తీవ్రంగా గాయపడింది. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం సాయంత్రం వీధిలో నుంచి బాలిక నడిచి వెళ్తుండగా ట్రాన్స్‌ఫార్మర్‌కు సమీపంలోని వర్షపునీటి మడుగుకు బాలిక కాలు తగలడంతో షాక్‌కు గురయ్యినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఏర్పాటు చేసిన ఎర్త్ సిస్టం వైఫల్యం కారణంగానే సమీపంలోని వరద నీటికి విద్యుత్ ప్రసరించిందన్నారు. వెంటనే కుటుంబ సభ్యులు, గ్రామస్తులు బాలికను కవిటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ బాలికకు ప్రథమ చికిత్స అందజేసి, మెరుగైన చికిత్స కోసం బరంపురం సిఫారుసు చేశారు. అయితే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తలెత్తిన ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

టెక్కలిరూరల్: మండలంలోని నౌపడ రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు టెక్కలి పోలీసులు తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు సుమారు 35 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని, కుడి చేతి మీద సంజయ్ అని హిందీలో పచ్చబొట్టు ఉందని పేర్కొన్నారు. మృతుడిని ఎవరైనా గుర్తిస్తే టెక్కలి పోలీసుస్టేషన్‌కు లేదా 6309990860, 6309990945 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

- ఒడిశా మార్కెట్లో కాలం చెల్లిన హెరిటేజ్ ఉత్పత్తులు
- ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడుల్లో వెలుగు చూసిన వాస్తవాలు
- విక్రయిస్తున్న దుకాణాలు సీజ్
- సోషల్ మీడియా పోరాటంతో బయటపడిన బాగోతం

పాపాలు..
ప్రజారోగ్యానికి శాపాలు



కాలం చెల్లిన హెరిటేజ్ పెరుగు ప్యాకెట్లని చెత్త బుట్టల్లో వేస్తున్న మున్సిపల్ సిబ్బంది



కాలంచెల్లిన పదార్థాల నిర్వీర్యం

కొరాపుట్: ఆంధ్రా నుంచి ఒడిశాకు వస్తున్న హెరిటేజ్ ఫుడ్స్ అసలు బండారాన్ని అధికారులు బయటపెట్టారు. కాలం చెల్లిన సరుకులు అమ్ముతున్న వైనాన్ని జనం ముందు ఉంచారు. ఆంధ్రప్రదేశ్ నుంచి జయపూర్ వస్తున్న హెరిటేజ్ పెరుగు, పాల ప్యాకెట్లే లక్ష్యంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేశారు. సోమవారం కొరాపుట్ జిల్లా కేంద్రం నుంచి వచ్చిన జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రభాత్ కుమార్ శెఠి నేతృత్వంలో అధికారులు హెరిటేజ్ ఉత్పత్తులు విక్రయిస్తున్న షాపులపై మెరుపు దాడులు చేశారు. ఎంజీ రోడ్డు, మెయిన్ రోడ్డు, సంగీత జంక్షన్‌ల వద్ద జరిపిన సోదాల్లో కాలం చెల్లిన పాడైన పెరుగు ప్యాకెట్లు పెద్ద ఎత్తున దొరికాయి.

అంతా మా ఇష్టం

వాస్తవానికి పాల ఉత్పత్తుల సంస్థల అవుట్‌లెట్లలో విక్రయించే వారికి కొత్త ఉత్పత్తులు ఇచ్చేటప్పుడు కాలం చెల్లిన ఉత్పత్తులు తిరిగి తీసుకొని వెళ్తారు. ఇదే పద్ధతి ఒడిశా ప్రభుత్వ పాల ఉత్పత్తి సంస్థ అమలు చేస్తుంది. ప్రతి రోజూ కొత్త ఉత్పత్తులు ఇవ్వడంతో పాటు కాలం చెల్లిన ఉత్పత్తులను తమ వ్యాన్‌లోనే తిరిగి తీసుకొని పోతారు. కానీ హెరిటేజ్ ఈ నిబంధన పాటించడం లేదు. ఆంధ్రా నుంచి ఉత్పత్తులు తేవడమే తప్ప పాడైన వాటిని తిరిగి తీసుకువెళ్లడం లేదు. అడిగే వారు ఎవరూ లేకపోవడంతో ఇష్టరాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

ప్రజారోగ్యంతో చెలగాటం

హెరిటేజ్ సంస్థ ప్రజల ఆరోగ్యం తో చెలగాటం ఆడింది. కాలం చెల్లిన పాలు, పెరుగు తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం. పట్టణంలో దాడులు జరుగుతున్నప్పటికీ ఇతర షాపులలో విక్రయాలు యథేచ్ఛగా కొనసాగించారు. అందుకే అధికారులు హెరిటేజ్ సిబ్బందిని వెంటబెట్టుకొని వెళ్లి దాడులు చేసి తాము పట్టుకున్న కలుషిత హెరిటేజ్ ఉత్పత్తులు వారికి చూపించి వారి సమక్షంలోనే మున్సిపాలిటీ చెత్త డబ్బాల్లో వేశారు. ఈ దాడులు జరుగుతున్నప్పుడు పెద్ద ఎత్తున ప్రజలు వారి వెంట తరలి వెళ్లారు. పెద్ద మొత్తంలో పాడైన హెరిటేజ్ ఉత్పత్తులు ఉన్న షాపులను సీజ్ చేశారు. పలు షాపుల యజమానులకు ఫైన్‌లు విధించారు.

పక్క జిల్లా అధికారి రాక..

హెరిటేజ్ పై జయపూర్ ప్రజలు సోషల్ మీడియాలో చేస్తున్న విమర్శలు రాష్ట్ర రాజధాని వరకు వెళ్లాయి. దాంతో పక్కనే ఉన్న మల్కన్ గిరి జిల్లా నుంచి ఫుడ్‌సేఫ్టీ అధికారి ప్రభాత్ కుమార్ శెఠిని ఇన్‌చార్జి హోదాలో పంపించి ప్రభుత్వం దాడులు చేయించింది. కొత్త ముఖాలు కావడంతో దాడుల నుంచి ఎవరూ తప్పించుకోలేకపోయారు. దాడుల అనంతరం ప్రభాత్ కుమార్ మీడియాతో మాట్లాడారు. హెరిటేజ్ పై వస్తున్న విమర్శలు నిజమేనని ప్రకటించారు. తానే స్వయంగా కలుషిత హెరిటేజ్ ఉత్పత్తులు పట్టుకున్నానని మీడియాకి చూపించారు. ఇంకా ఎక్కడైనా ఫిర్యాదులు ఉంటే మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు.

బాధిత మహిళల ఇంటికి హెరిటేజ్ సిబ్బంది

ఇటీవల జయపూర్ పట్టణంలో హెరిటేజ్ పెరుగు ప్యాకెట్లు కొన్న మహిళలు అందులో కలుషిత పదార్థాలు చూసి సోషల్ మీడియాలో పెట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో హెరిటేజ్ కంపెనీ ప్రతినిధులు మీడియా ముందుకు వచ్చి అవి కాలం చెల్లినవని వివరణ ఇచ్చారు. మహిళల పోస్టింగ్స్ పెద్ద ఎత్తున వైరల్ కూడా అయ్యాయి.

అర్జీలు వేగవంతంగా పరిష్కరించాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- మీకోసంలో 154 వినతుల స్వీకరణ



కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తున్న గార ఎంపీపీ రఘురాం తదితరులు



గ్రీవెన్సులో వినతి అందజేస్తున్న రవికుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజలు ఇచ్చే అర్జీలను వేగవంతంగా అధికారులు పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రజల నుంచి 154 విజ్ఞప్తులను స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్ర స్థాయికి స్వయంగా వెళ్లి పారదర్శకమైన విచారణ జరిపి, నిర్ణీత సమయంలో అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని ఆదేశించారు.

ఈవోపై విచారణ చేయాలి

దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగేశ్వర ఆలయ ఈవో అవినీతికి పాల్పడుతున్నాడని, ఆయన అవినీతిపై విచారణ చేయాలని మీకోసంలో శ్రీముఖలింగంకి చెందిన ఎస్.రాజశేఖర్ ఫిర్యాదు చేశారు. కార్తీక మాసం, మహా శివరాత్రి పర్వదినాలు, ఉత్సవాల సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలకు, తాత్కాలిక మౌలిక వసతులకు అయ్యే ఖర్చు, ఆలయానికి వచ్చిన భక్తులకు నిర్వహణ ఖర్చులకు దొంగ బిల్లులు పెట్టి అవినీతికి పాల్పడుతున్నారని పేర్కొన్నారు.

ర్యాంపు నిర్వహణ ఆపాలి

గార మండలంలోని గార గ్రామంలో నడుపుతున్న ఇసుక ర్యాంపులో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు చేస్తున్నారని ఎంపీపీ గొండు రఘురాం, పీస గోపీ, ముంజేటి కృష్ణమూర్తిలు కలెక్టర్‌కి ఫిర్యాదు చేశారు. ఈ తవ్వకాల వలన గ్రామ ప్రజలతో పాటు మండలంలో ఉన్న వంశధార నదీ పరివాహక గ్రామాల ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అక్రమ తవ్వకాలు జరుగుతున్న ప్రదేశం నుంచి 100 మీటర్ల దూరంలో గార మండలానికి మంచినీటిని అందించే ప్రాజెక్టు ఉందన్నారు. అక్రమ ఇసుక తవ్వకాల వలన ప్రాజెక్టుకు నీరు అందే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వంశధార నదీ పరివాహక ప్రాంతాల్లో ఉన్న రైతులకు చెందిన సుమారు 100 వ్యవసాయ పంపుసెట్లు ద్వారా వ్యవసాయానికి నీరు అందించే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా అక్రమ ఇసుక తవ్వకాలపై తగు చర్యలను తీసుకోవాలని విన్నవించారు.

ఐదు ల్యాప్‌టాప్‌ల పంపిణీ

డిగ్రీ ఆపైన చదువుతున్న దివ్యాంగ విద్యార్థులకు విభిన్న ప్రతిభావంతులు, వయోవద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐదు ల్యాప్‌టాప్‌లు, ఒక స్మార్ట్‌ఫోన్‌ను కలెక్టర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిజబుల్ డిపార్టుమెంట్ ఏడీ కవిత తదితరులు ఉన్నారు.

దౌర్జన్యాలను కట్టడి చేయండి

కూటమి నాయకులు చేస్తున్న దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేయాలని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ కోరారు. ఈ మేరకు మీకోసంలో సోమవారం ఫిర్యాదు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదలు, ప్రతిపక్షపార్టీ సానుభూతిపరులు, చిరుద్యోగులకు రక్షణ కరువైయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సరుబుజ్జిలి మండలంలోని తెలికిపెంట గ్రామ పంచాయతీలో గ్రామ సర్పంచ్ పంచాయతీ నిధులు తన భర్త పేరుమీద అన్యాక్రాంతం చేశారన్నారు. దీనిపై ఫిర్యాదు చేసిన వారిపై, విచారణకు వచ్చిన అధికారులపై టీడీపీ నాయకులు దౌర్జన్యం చేస్తున్నారని తెలిపారు. ఘటనపై విచారణ జరిపాలని కోరారు. సరుబుజ్జిలి మండలంలోని మతలబుపేట పంచాయతీలో ఉపాధి హామీ నిధులు దుర్వినియోగం చేస్తూ, టీడీపీ నాయకులు తమ సొంత పొలాలకు సీసీ రోడ్లు వేస్తున్నారని, ఆ పనుల బిల్లులు నిలుపుదల చేయాలని విన్నవించారు. ఆమదాలవలస మున్సిపాలిటీలోని వూసవానిపేటకు చెందిన దివ్యాంగ బాలుడికి పెన్షన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. బూర్జ మండలంలోని కటకమయ్యపేట గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలకు వితంతు పెన్షన్‌లు రాజకీయ కారణాలతో మంజూరు చేయడంలేదని, వారికి పెన్షన్‌లు ఇప్పించాలని కోరారు. పొందూరు మండలంలోని గోకర్ణపల్లి గ్రామంలో ఉపాధి పనుల్లో టీడీపీ నాయకులు చేస్తున్న అవకతవకలపై విచారణ జరిపించాలన్నారు.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 45 ఫిర్యాదులు



ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ (గ్రీవెన్సు)లో 45 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ కె.వి. మహేశ్వరరెడ్డి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అధికారులు ప్రజల ఫిర్యాదులపై జాప్యం వహించరాదని, సకాలంలో పరిష్కరించాలని స్పష్టం చేశారు.